జిల్లాకు రైతు సంక్షేమ కేంద్ర బృందం రాక

ప్రజాశక్తి - ఏలూరు/పెదవేగి

వ్యవసాయ, పర్యావరణ అనుకూల, అవసరమైన పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా శనివారం వ్యవసాయ, రైతు సంక్షేమ కేంద్ర కార్యదర్శి మనోజ్‌అహుజాతో కూడిన కేంద్ర బృందం జిల్లా చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కేంద్ర కార్యదర్శికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు పరిస్థితిని కలెక్టర్ వారికి వివరించారు. పెదవేగి ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థను మనోజ్‌అహుజాతోపాటు జాయింట్ సెక్రటరీ ఎకె.సాహు, వ్యవసాయ కమిషనర్ పికె.సింగ్ సందర్శించారు. కార్యక్రమంలో జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, ఉద్యాన శాఖాధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

క్యాష్ కొట్టు.. టిక్కెట్ పట్టు..!

- అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారిన ఆర్థిక బలం
- రూ.కోట్లు కుమ్మరిస్తే కొత్తవారికైనా టిక్కెట్
- క్షేత్రస్థాయిలో బలమున్నా డబ్బు లేకపోతే పక్కకే
- వైసిపి, టిడిపి, జనసేనలోనూ ఇదే పరిస్థితి
- డబ్బు సంచులతో తెరపైకి కొత్త ముఖాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నీతి, నిజాయతీ, విలువలతో పని లేకుండాపోయింది. ఎవరు ఎక్కువ కోట్లలో సొమ్ము ఖర్చు పెడితే వారికే టిక్కెట్ అన్నట్లు ప్రధాన పార్టీల వ్యవహారశైలి తయారైంది. దీంతో కొంతమంది నాయకులకు ప్రజాబలం ఉన్నా టిక్కెట్ రాని పరిస్థితి నెలకొందనే చర్చ నడుస్తోంది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన సైతం ఇదే తరహాలో అభ్యర్థుల ఎంపికను కొనసాగిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన పార్టీల్లో టిక్కెట్ ఆశిస్తున్న నేతల్లో పలువురికి ఆర్థిక బలం లేక ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఎన్నికల తంతు మొత్తాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు డబ్బుమయంగా మార్చేసిన పరిస్థితి ఉంది.

పోలవరం ఎంఎల్‌ఎగా పని చేస్తున్న తెల్లం బాలరాజుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో ఈసారి ఆయన్ని తప్పించాలని వైసిపి అధిష్టానం భావించింది. ఆయన్ని మారిస్తే పెద్దఎత్తున సొమ్ము ఖర్చు పెట్టే నేతలు లేరని బాలరాజు భార్యకే టిక్కెట్ కేటాయించినట్లు ప్రచారం సాగుతోంది. చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో ఆయనకు టిక్కెట్ ఇచ్చేందుకు వైసిపి నిరాకరించింది. ఎంతోమంది ఆశావహులు చింతలపూడి టిక్కెట్ ఆశిస్తున్నప్పటికీ ఆర్థిక, అంగ బలం ఉన్న రవాణాశాఖ అధికారి విజయరాజుకు టిక్కెట్ కేటాయించినట్లు చెబుతున్నారు. ఈయన స్వయంగా శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు వియ్యంకుడు. కైకలూరు ఎంఎల్‌ఎగా దూలం నాగేశ్వరరావు ఉన్నారు. ప్రజల్లో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉందని తేలింది. అదే నియోజకవర్గంలో ఇటీవల టిడిపి నుంచి వైసిపిలోకి వెళ్లి ఎంఎల్‌సి పదవి దక్కించుకున్న జయమంగళ వెంకటరమణకు ప్రజల్లో కొంత సానుకూలత ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అయితే జయమంగళ పెద్దఎత్తున సొమ్ము ఖర్చు పెట్టలేరనే కారణంతో ఆయనను పక్కన పెట్టి నాగేశ్వరరావు వైపే వైసిపి అధిష్టానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఆచంట, తాడేపల్లిగూడెం, నరసాపురం వంటి నియోజకవర్గాల్లోనూ స్థానిక ఎంఎల్‌ఎలపై వ్యతిరేకత ఉన్నప్పటికీ సరైన ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులు దొరకకపోవడంతో ప్రస్తుతం ఉన్నవారినే కొనసాగించేందుకు వైసిపి ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ముమ్ముందు విడుదల చేసే అభ్యర్థుల జాబితాల్లో ఏమైనా మార్పులు ఉంటాయో, లేదో వేచిచూడాలి. ఏలూరు ఎంపీగా ఆర్థిక బలం మెండుగా ఉన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌ను రంగంలోకి దించారు. ఈయన జనానికి పెద్దగా తెలియని వ్యక్తి అయినప్పటికీ ఆర్థిక బలం చూసి ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. నరసాపురం ఎంపీ అభ్యర్థి విషయంలో ఆర్థిక బలం ఉన్నవారి కోసం వైసిపి వెదుకులాడుతున్నట్లు సమాచారం.

టిడిపి, జనసేనది అదేబాట

టిడిపి, జనసేన సైతం ఆర్థిక బలం ఉన్నవారికే టిక్కెట్ ఇచ్చేందుకు తహతహలాడుతున్నట్లు చర్చ నడుస్తోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా, టిడిపి హయాంలో ఏలూరు ఎంపీగా మాగంటి బాబు పని చేశారు. ఈసారి ఆయన టిడిపి నుంచి ఏలూరు ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఎంపీగా పోటీలోకి దిగాలంటే కనీసం రూ.60 కోట్లుపైగా ఉండాలని, మాగంటి బాబు వద్ద అంత ఆర్థిక బలం లేదనే కారణంతో ఆయనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. మాగంటి కుటుంబం సుదీర్ఘకాలంగా ఏలూరుతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల్లో కీలక భూమిక పోషించింది. మాగంటి బాబు కుటుంబానికి జనాల్లో ఆదరణ ఉన్నప్పటికీ ఆర్థిక బలం లేదనే కారణంగా టిడిపి పక్కన పెట్టినట్లు సమాచారం. దెందులూరు నియోజకవర్గంలో చింతమనేనిని వ్యతిరేకిస్తున్న అదే సామాజిక తరగతికి చెందిన నాయకులు దెందులూరు టిక్కెట్ మాగంటి బాబుకు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఆర్థిక బలం లేదని చెప్పి అక్కడ కూడా ఆయన్ని పరిగణనలోకి తీసుకోలేదని తెలుస్తోంది. ఏలూరు ఎంఎల్‌ఎ టిక్కెట్ జనసేనకు ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న రెడ్డి అప్పలనాయుడుకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయనకు ఆర్థిక బలం లేదనే కారణంతో జనసేన అధిష్టానం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. టిడిపి ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గన్ని వీరాంజనేయులు, జనసేన ఇన్‌ఛార్జిగా మత్సపట్ల ధర్మరాజు ఉన్నారు. గన్నిపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనే కారణంతో టిక్కెట్ ఎవరికి ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నారు. దీంతో వట్టి వసంతకుమార్ కుటుంబం నుంచి వచ్చిన ఆర్థిక బలం ఉన్న వట్టి పవన్‌పై మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఆ టిక్కెట్ జనసేనకు కేటాయించినా ధర్మరాజుకు కాకుండా ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థికే ఇవ్వాలని చర్చలు సాగుతున్నట్లు సమాచారం. చింతలపూడి, పోలవరం, కైకలూరుతోపాటు మిగిలిన స్థానాల్లో ఆర్థిక బలం పుష్కలంగా ఉన్న అభ్యర్థుల కోసం టిడిపి, జనసేన సైతం ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో కోట్లు కుమ్మరించేవారికి టిక్కెట్ అనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఆర్థిక బలం ఉన్న అభ్యర్థులను పార్టీలు ఎంపిక చేస్తుండటంతో ఈ ఎన్నికల్లో చాలాచోట్ల కొత్తముఖాలు తెరపైకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. మరి ఇటువంటి నేతలు ప్రజాప్రతినిధులైతే ప్రజా సమస్యలు ఏమేరకు పరిష్కరిస్తారనేది అంతుబట్టని ప్రశ్నే.

ఏలూరులో ఓటింగ్ కనీసం 80 శాతం ఉండాలి

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఓటుహక్కు అనేది భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం నగరంలోని మెప్మా గ్రూపులకు సంబంధించిన మహిళలతో ఓటర్ల నమోదు, ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి దిక్సూచి అయిన ఓటును వినియోగించుకోవడం ప్రజల ప్రథమ కర్తవ్యమన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో 86 నుంచి 88 శాతం పోలింగ్ జరిగినప్పటికీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 67 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందన్నారు. అయితే ఈసారి పోలింగ్ శాతం కనీసం 80 శాతం ఉండేలా ఓటర్లను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని, ఓటర్లు తమ పేర్లు పోలింగ్ కేంద్రంలో ఉన్నదీ పరిశీలించుకోవాలన్నారు. సమావేశంలో మెప్మా పిడి బి.ఇమ్మాన్యుయేల్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నా ఓటు.. నా బాధ్యత

సెల్ఫీ దిగిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నా ఓటు–నా బాధ్యత అనే సెల్ఫీ బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కూడా సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నేను ఓటు హక్కు కలిగి ఉన్నాను.. నేను ఓటు వేస్తాను' అనే నినాదంతో ఓటర్లంతా రానున్న ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

భీమడోలులో..

కుక్కునూరులో..

ముసునూరులో..

నూజివీడులో..

జీలుగుమిల్లిలో..

రోడ్డుపై బైఠాయించి.. పిడికిలెత్తి నినదించి..!

40వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకోలు - పలుచోట్ల 40 అంకె ఆకారంలో ఒదిగి నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు అనుబంధ సంఘాలైన ఆశ వర్కర్స్ యూనియన్, మెప్మా ఆర్పీలు, మెడికల్ అండ్ హెల్త్ తదితర సంఘాలు వారికి మద్దతు తెలియజేశారు. సిఐటియు ఆధ్వర్యంలో వీరందరూ ఫైర్ స్టేషన్ సెంటర్ చేరుకొని రోడ్డుపై బైఠాయించి రాస్తారాకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సరళ, పుణ్యవతి, మెప్మా యూనియన్ నాయకులు కృష్ణవేణి, రవాణా రంగ కార్మికులు వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

చింతలపూడిలో జగన్ ఫోటోతో రోడ్డుపై బైఠాయించి నిరసన

కొయ్యలగూడెం : మండల కేంద్రంలో అంగన్వాడీ నిరసనలు 40వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిరసన కేంద్రం నుంచి కొయ్యలగూడెం మెయిన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ విజయవాడలో నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో శివరత్న కుమారి, జె.నాగవేణి, కె.కోసేశ్వరి, శ్రీదేవి, ఎస్‌కె.మస్తాన్, కె.శ్యామల, సిహెచ్.సునిత రాయ్, కె.గంగరత్నం, జ్యోతి పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు సాయిబాబా గుడి ఆవరణ వేదికగా అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారంతో 40వ రోజుకు చేరుకుంది. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు దీక్షా శిబిరం నుంచి భీమడోలు జంక్షన్‌కు చేరుకుని రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ప్రసంగించారు. అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించిన రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కర రావు, కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ సమన్వయకర్త వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మానుకొండ వీర్రాజు, సిపిఎం నాయకులు నాగరాజు, రైస్ మిల్ యూనియన్ నాయకులు బాలాజీ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు చల్లామణి, స్వర్ణకుమారి, రాజా, మణి నాయకత్వం వహించారు.

నిడమర్రు : నిడమర్రులో అంగన్వాడీ వర్కర్స్ సమ్మె 40వ రోజుకి చేరుకుంది. అంగన్వాడీ వర్కర్స్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రదర్శనగా నిడమర్రు మూడు రోడ్ల కూడలికి చేరుకుని మెయిన్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. అటుగా వెళ్తున్న ఉంగుటూరు నియోజవర్గ ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు కారును అంగన్‌వాడీ వర్కర్స్ అడ్డుకుని 40 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఎల్‌ఎకు వినతిని అందించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, కానూరు రాజు, బిసి సెల్ నాయకుడు నేకూరి ఆశీర్వాదం, కంచ వరప్రసాద్ సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రేమలత, సుభాషిని, ఎస్‌కె.రబియా, నాగేశ్వరి, ధనలక్ష్మి, రామలక్ష్మి, జయమ్మ నాయకత్వం వహించారు.

చాట్రాయి : అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 40వ రోజుకు చేరుకుంది. మండల తహశీల్దార్ కార్యాలయం నుంచి అంగన్వాడీలు నినాదాలు చేస్తూ సెంటర్‌కు చేరుకొని మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు చాగంటి రాజారావు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి విజయ, కళ్యాణి, సుధా, పద్మ నాయకత్వం వహించారు.

మండవల్లి: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అంగన్వాడీ వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకుని అంగన్వాడీలు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని అంగన్వాడీలు స్పష్టం చేశారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ఆందోళన 40వ రోజుకు చేరుకుంది. శనివారం అంగన్వాడీలు గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం మాట ఇచ్చాడు జగనన్నా.. మాట తప్పాడు జగనన్నా.. పోరాడి పోరాడి తీరుతాం.. సాధించి సాధించి తీరుతాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు వాణి, చెల్లమ్మ, విజయలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

లింగపాలెం : అంగన్వాడీల సమ్మె మండలంలో 40వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం లింగపాలెం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే సమ్మెకు మద్దతుగా శనివారం ఏలూరు నుంచి చింతలపూడి వెళ్లే రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 40 రోజులకు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు డి.దాస్, జ్యోతి, అంగన్వాడీ సంఘం నాయకులు బిజెఎన్.కుమారి, ఈశ్వరి, మేరీ, మార్తామ్మా, రజిని, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ముదినేపల్లి : తమ సమస్యల పరిష్కారం కోరుతూ ముదినేపల్లిలో అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారంతో 40వ రోజు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు శిబిరం వద్ద నుంచి ర్యాలీగా పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ గురజ రోడ్డు సెంటర్ వరకు వచ్చారు. అనంతరం గుడ్లవల్లేరు, బంటుమిల్లి రోడ్ల సెంటర్‌లో రాస్తారోకో చేశారు. ఈ రాస్తారోకో సందర్భంగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమానికి అరుణ, పద్మ, రిబ్కా, మణి నాయకత్వం వహించారు.

చాట్రాయిలో..

ఏలూరు అర్బన్ : రాష్ట్రంలో లక్షా ఆరు వేల మంది అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు గత 40 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించమని సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా ఘోరమైన చర్య అని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఇతర ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం అంగన్వాడీలకు మద్దతుగా రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ డాంగే, ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్‌కు, ఆయాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో అంగన్వాడీలకు మద్దతుగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాస్తారోకో కార్యక్రమానికి ఎఐటియుసి ఏలూరు ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణమాచార్యులు, ఎఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, సిఐటియు నాయకులు పి.కిషోర్, బి.జగన్నాథం, వి.సాయి బాబు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పి.ఆదిశేషు, ఐఎఫ్‌టియు నాయకులు పల్లి గంగరాజు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలతో శనివారం స్థానిక ఎంఆర్‌ఒ ఆఫీస్ నుంచి ర్యాలీగా నెహ్రూ బొమ్మ దగ్గర వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 40 రోజులు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా మొద్దు నిద్ర పోతుందని విమర్శించారు. ఈ కార్యక్రమానికి కార్మిక సంఘాలు పూర్తి మద్దతు పలికారు. వెలుగు యానిమేటెడ్ సంఘం మండల కార్యదర్శి లక్ష్మీ రాధ, అంగన్వాడీలు కృపామని, రామలక్ష్మి, సుజాత, సీత, మున్ని, మంగ, మంగతాయారు, కన్నమ్మ పాల్గొన్నారు.

కలిదిండి : ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 40వ రోజుకు చేరింది. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కలిదిండి ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు షేక్ అబిదా బేగం, జెక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

నూజివీడు : అంగన్వాడీల సమ్మె 40వ రోజు సందర్భంగా నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, మనీ, గ్లోరీ, పద్మ, శ్యామల, కృష్ణకుమారి, ఝాన్సీ, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, సిఐటియు నాయకులు జయలక్ష్మి, గోవిందు, రజిని, ఉషారాణి, కమల, నాగమణి, శోభనాద్రి, మరియదాస్, దుర్గారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ శనివారానికి 40వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట 40వ అంకె రూపంలో అంగన్వాడీలు ఒదిగి నిరసన తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై సమస్యలు పరిష్కరించాలని రిలే నిరాహార దీక్ష చేశారు. సమ్మెకు పిడిఎస్‌యు నాయకులు సరియం రామ్మోహన్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, సరళ, ఎస్తేరు, వరలక్ష్మి, మంగ పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెలో భాగంగా 40వ రోజు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైటాయించి ఆందోళన నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ఉంగుటూరు : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు 40 రోజులుగా చేస్తున్న దీక్షలను పట్టించుకోని ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఉంగుటూరులో శనివారం సిఐటియు, భవన నిర్మాణ కార్మిక సంఘం, కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆందోళన, రాస్తారోకో నిర్వహించారు. మహిళల ఆధ్వర్యంలో 40 రోజుల పాటు తమ హక్కుల కోసం సమ్మె, న్యాయపోరాట ఉద్యమం చేసిన ఖ్యాతి అంగన్‌వాడీలకే దక్కిందని గుత్తికొండ వెంకట కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వై.సుజాత, శాంతకుమారి, ఝాన్సీ, వెంకటలక్ష్మి, శ్రీదేవి, సరస్వతి, కనకరత్నం, కౌలు రైతు నాయకుడు కొర్ని అప్పారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: గత 40 రోజులుగా చేస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఆగిరిపల్లి పెద్ద కొఠాయి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నమ్మ, సంతోష్ రూప, జ్యోతి, అనురాధ, అరుణ, పుల్లమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొనగా సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, సిఐటియు మండల కార్యదర్శి ఆర్.చంటి, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.నరేష్, వ్యకాస నాయకులు ఎస్.కోటేశ్వరరావులు సంఘీభావం తెలిపారు.

ఏలూరులో..

ఆగిరిపల్లిలో..

మండవల్లిలో..

ద్వారకాతిరుమల : అంగన్వాడీల సమ్మె 40 రోజులకు చేరిన దృష్ట్యా సిఐటియు, సిపిఎం ఆధ్వర్యాన ద్వారకాతిరుమల అంబేడ్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లక్ష మందికిపైగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, పేద మహిళల సమస్యల పట్ల మొండిగా ఉండడం దుర్మార్గం అన్నారు. 40 రోజులుగా ఎంతో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే వారి సహనానికి, ఓర్పుకి పరీక్ష పెట్టడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కట్ట భాస్కరరావు, ఎం.నాగులపల్లి, పార్టీ గ్రామ కార్యదర్శి పోలుకొండ నాగరాజు, పంగిడిగూడెం పార్టీ నాయకులు మానుకొండ వీర్రాజు, అంగన్వాడీ యూనియన్ మండల నేతలు తులసి, సుధా నాయకత్వం ఇచ్చారు.

ముసునూరు: గత 40 రోజులుగా సమ్మె చేస్తుంటే జగన్మోహన్ రెడ్డి మా పై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు సెంటర్ మండపం వద్ద మండలంలోని 16 గ్రామాల అంగన్వాడీలతో కలిసి మానవహారం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లి పాము రాజకుమారి, కలపాల విద్యావతి, దుర్గ, లక్ష్మి, విజయలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

కుక్కునూరు : అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య విమర్శించారు. అంగన్వాడీల 40వ రోజు సమ్మె ప్రారంభంలో శుక్రవారం గుండెపోటుతో మృతి చెందిన శాంతి కుమారికి సంతాపం తెలిపి కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం 40 అంకె రూపంలో ఒదిగి నిరసన తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోలో విఆర్ఎ, ఆశాలు, యానిమేటర్లు, స్కూల్ స్వీపర్లు, మిడ్డేమిల్ వర్కర్లు పాల్గొన్ని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు, కార్యదర్శి కుంజ నాగలక్ష్మి, యర్నం సాయికిరణ్, మండల ఉపాధ్యక్షులు పోచారపు వెంకన్నబాబు పాల్గొన్నారు.

పోలవరం : అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలు శనివారం 40వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలు 40 ఆకారంలో ఒదిగి నిరసన తెలిపారు. అనంతరం దీక్ష శిబిరం నుంచి స్థానిక ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం నిర్వహించి ధర్నా చేసి వాహనాలు నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్స్ పద్మావతి, చెరుకూరు మనీ, సరస్వతి, హైమావతి, కుబ్రా జుబేదా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కాలిబాట వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం

వంతెనపై రాకపోకలు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కెనాల్‌పై గతంలో పున:నిర్మించిన పాత కాలిబాట వంతెనకు గ్రామ పంచాయతీ నిధులతో నూతనంగా అప్రోజ్‌రోడ్డు నిర్మాణం, రెయిలింగ్ ఏర్పాటు చేశారు. పూర్వం ఉన్న పాత వంతెన శిధిలావస్థకు చేరింది. దీంతో ఐదేళ్ల క్రితం ఈవంతెనను కూల్చివేసి సూమారు రూ.3 లక్షల నిధులతో నూతన కాలిబాట వంతెన నిర్మాణం చేశారు. అయితే ఈ వంతెనకు అప్పట్లో అప్రోజ్‌రోడ్డు, రెయిలింగ్ ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా వంతెన నిర్మాణం జరిగినా అప్రోజ్, రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు వినియోగంలోకి రాక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దీంతో గత పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం గడువు ముగిసింది. తర్వాత ఏర్పడిన పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ వంతెన ప్రాధాన్యతను గుర్తించిన గ్రామ సర్పంచి కైకమ్మ రూ.1.53 లక్షలతో కాలిబాట వంతెనకు అప్రోజ్ రోడ్డు నిర్మాణం, వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. దీంతో కాలిబాట వంతెన వినియోగంలోకి వచ్చింది. అప్రోజ్, రెయిలింగ్ నిర్మాణంతో వంతెన వినియోగంలోకి రావడంతో గ్రామస్తులు, రైతులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

కాలిబాట వంతెనకు అప్రోజ్, రెయిలింగ్ ఏర్పాటు

తాగునీటి సంపు.. బట్టలు ఉతికే బండగా..!

ప్రజాశక్తి - మండవల్లి

సర్పంచి పర్యవేక్షణ లోపం, కార్యదర్శి నిర్లక్ష్యం మండవల్లి ప్రజల పాలిట శాపంగా మారిందని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కొండరాయి చెరువు వద్ద ఉన్న సంపు బట్టలు ఉతికే బండగా మారిపోయిందని విమర్శిస్తున్నారు. కాసుల సంపాదనపై ఉన్న శ్రద్ధ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో లేకపోవడంతో బట్టల్లోని మురుగు సంపులో ఉన్న నీటిలో కలుస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతాయని గ్రామస్తులు భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామస్తులకు దాహార్తి తీర్చే విధంగా స్టేషన్ సెంటర్ కొండరాయి చెరువు వద్ద 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకాన్ని నిర్మించారు. కార్యదర్శి, సర్పంచి పర్యవేక్షణ కొరవడంతో స్థానికులకు పథకం వద్దనున్న సంపు బట్టలు ఉతుక్కునే బండగా మారిపోయింది. ఈ విషయంపై సర్పంచి, కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరని గ్రామస్తులు చెబుతున్నారు. జలజీవన్ మిషన్ ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్పంచి, కార్యదర్శిపై చర్యలు తీసుకుని స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఇఒపిఆర్‌డి ఆనంద్ బాబును వివరణ కోరగా పరిశీలించి కార్యదర్శిపై చర్యలు తీసుకుంటానని అన్నారు.

బట్టలు ఉతుకుతున్న మహిళ

ముగిసిన నవోదయ పరీక్షలు

96 మంది హాజరు

ప్రజాశక్తి - భీమడోలు

నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతి ప్రవేశానికి భీమడోలు హైస్కూల్ కేంద్రంగా శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పరీక్షా కేంద్రం పర్యవేక్షకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షలకు రాసేందుకు కేంద్రానికి హాజరు కావలసిన 149 మందిలో 96 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం పరిశీలకులుగా భీమడోలు హైస్కూల్ ఉపాధ్యాయులు అహ్మద్ వ్యవహరించారు.

గ్రామాల అభివృద్ధి ఘనత జగన్‌దే

ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాలు అభివృద్ధి చెందిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని నూజివీడు ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాటెనిపాడు గ్రామంలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం నిర్మించారని, రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వెల్నెస్ సెంటర్లు నిర్మించి గ్రామాల ప్రాంతానికి, దేశానికి అత్యంత ఉన్నత ప్రాధాన్యత సంతరించుకోవాలని ఆయన ఆకాంక్షించారని కొనియాడారు. అదేవిధంగా గ్రామ సచివాలయ స్థల దాతలైన కంబాల రాంబాబు, కంబాల దాను, తాత, తండ్రి కుటుంబ సభ్యులందరినీ ఘనంగా సన్మానించారు. అనంతరం లోపూడిలో వాటర్ ట్యాంక్ నిర్మాణ ప్రారంభోత్సవం, ఎల్లాపురంలో జలజీవన్ మిషన్ ప్రారంభోత్సవం ఇలా పలు కార్యక్రమాలకు ఎంఎల్‌ఎ శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గ భవాని వెంకట్రావు, వైసిపి ఎంపిటిసి కోటగిరి రాజానాయన, పాముల గంగాధర్ రావు, సర్పంచి గద్దల సుహాసిని మోహన్ రావు, లోపూడి సర్పంచి పేరం కృష్ణ పాల్గొన్నారు.

టిడిపికి గూటికి ఎలిజా?

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్‌ఎ ఉన్నమాట్ల ఎలిజా టిడిపిలోకి చేరుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. వైసి తమను మోసం చేసిందని, ముఖ్యమంత్రి వద్దకు తమ చింతలపూడి నియోజకవర్గ సర్వే వేళ్లకుండా పెత్తందార్లు అడ్డుకున్నారని, ఎలిజా తమ బాధను గతంలో పంచుకున్నారు. ఈ తరుణంలో టిడిపిలోకి చేరుతున్నారనే ప్రశ్నకు తమ అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. జనవరి 29వ తేదీన భీమవరంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనలో పార్టీ కండువా కప్పుకుంటున్నట్లు తమ అనుచరులు చెప్పుకుంటున్నారు. ఇప్పటికే టిడిపి అధిష్ఠానంతో మంతనాలు జరిపారని, నియోజకవర్గం నాయకులతో రహస్య మంతనాలు కూడా జరిపినట్లు చెబుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో వైసిపి ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావుకి పోటీగా వెళ్తున్నట్లు సమాచారం.

29న 'రా కదలిరా'ను విజయవంతం చేయాలి

భీమడోలు : భీమడోలులో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న 'రా కదలిరా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారన్నారు. ఈమేరకు సమావేశ నిర్వహణపై చర్చించేందుకు శనివారం భీమడోలులోని టిడిపి కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గన్ని వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టిడిపితో పాటు మిత్రపక్షమైన జనసేన సైతం తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సమయానికి. ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను పూర్తిచేయాలని టిడిపి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన టిడిపి ప్రముఖులు, జిల్లా స్థాయి నాయకులు హాజరయ్యారు.

రాష్ట్రస్థాయిలో గెలుపొందాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - ముసునూరు

ఆడుదాం ఆంధ్ర ఆటలో ఆడిన ప్రతి క్రీడాకారుడు శక్తి వంచి కృషి చేసి రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని నూజివీడు ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో గెలుపొందిన ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండ దుర్గా భవాని వెంకట్రావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధర్ రావు, మండల వైసిపి అధ్యక్షులు ములవూరి నాగమల్లేశ్వరరావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దారు దానికి సుధా, వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్, అలీ ఖాన్, నాగమల్లేశ్వరి, హేమ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నిమ్మ తోటలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు నరుకుతుండగా అడ్డుకున్న వ్యక్తిని చంపుతామని బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా శనివారం ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి గ్రామ శివార్లలో నిమ్మతోట ఉంది. ఆ నిమ్మ తోటలోకి ఈనెల 17వ తేదీన తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం తిరుమల కుంట గ్రామానికి చెందిన పలివెల వెంకటేశ్వరరావు, దమ్మపేట మండలం ముష్టి బండ గ్రామానికి చెందిన మిడ్డే సీతమ్మ కొందరు వ్యక్తులతో కలిసి నాగలక్ష్మి తోటలోకి ప్రవేశించి నిమ్మ చెట్లు నరుకుతున్నారు. తోటలో పని చేస్తున్న నాగలక్ష్మి మామ మంగయ్య అడ్డుకోగా మంగయ్యను చంపుతామని బెదిరించారు. నాగలక్ష్మి ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై శనివారం ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకుల గూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఆంధ్రాకి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు, అతని నుంచి 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే : జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు : దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఇమిడి ఉందని జెడ్‌పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జెడ్‌పి కార్యాలయంలోని సమావేశపు హాలులో శనివారం జరిగిన 'విజయ కేతనం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్షా ప్రశ్నావళికి అనుగుణంగా జవాబులు రాసేందుకు వీలుగా అర్థవంతంగా తయారు చేయబడిన విజయ కేతనం పుస్తకం నిష్ణాతులైన ఉపాధ్యాయులచే రూపకల్పన చేయబడిందన్నారు. ఈ పుస్తకాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ పుస్తకాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని, ఈ సంవత్సరం మన జిల్లాలో 85 శాతం ఉత్తీర్ణత నమోదుకావాలని, తదనుగుణంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పుస్తక రూపకల్పనకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిషత్ ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉంటా

వెంపా దుర్గారావు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించడానికి ఏ స్వార్థము లేకుండా రాజకీయాల్లోకి వచ్చినట్లు స్వతంత్ర అభ్యర్థి వెంపా దుర్గారావు అన్నారు. చింతలపూడి పట్టణంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1951 సంవత్సరంలో చింతలపూడి నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు సరిహద్దు ప్రాంతాలైన జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట వంటి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకున్నాయి. కానీ చింతలపూడికి ఏమాత్రం అభివృద్ధి లేదని అన్నారు. నియోజకవర్గానికి మూలమైన చింతలపూడికి ఏం కావాలో నాకు తెలుసు. నియోజకవర్గంలో పలు ప్రాంతాలు కనీస రహదారి మరమ్మత్తులకు నోచుకోలేదు, యుద్ధ ప్రాతిపదికన వాటిని నిర్మించగలగాలని అన్నారు. నాకు ఏ పార్టీతో సంబంధం లేదని, అన్ని పార్టీలకు సంబంధించిన పెద్దలతో, యువతతో మమేకమై వాళ్ల అభిప్రాయాలను సేకరించి ఒక నిర్ణయానికి రావడం జరిగిందన్నారు. మన ఊరు-మన ప్రగతి అనే నినాదంతో ముందుకు సాగుతున్నాట్లు తెలియజేశారు.

సుబ్బారావు కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన కొప్పుల సుబ్బారావు భార్య కొప్పుల మరియమ్మ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి యువనేత కొడాలి వినోద్ శనివారం భౌతికకాయాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మరియమ్మ మట్టి ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్త్రీల పట్ల వివక్షను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి సమాజంలో స్త్రీ అన్ని రంగాల్లోని అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొన్నిచోట్ల వివక్షతకు గురవుతున్నారని, అటువంటి వివక్షతను నిర్మూలించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అధ్యక్షతన శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బందితో 'పనిచేస్తున్న ఉద్యోగినులపైన జరుగుతున్న అత్యాచారాలను నిరోధించటం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగినికి తాను పనిచేసే చోట అన్ని రకాల కనీసం సౌకర్యాలు కల్పించాలని, అటువంటి బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని సూచించారు. అలాగే ఏ స్త్రీ అయినా పనిచేసే చోట వివక్షతకు గురైతే సంబంధిత అధికారులకు ధైర్యంగా తెలియజేయాలని, తద్వారా ఇటువంటి చర్యలను నిర్మూలించవచ్చని సూచించారు. అలాగే స్త్రీలకున్న హక్కులపైనా, వివిధ స్త్రీల చట్టాలపైన అవగాహన కలిగించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో పోష్ యాక్ట్ కమిటీలను ఏర్పాటు చేయాలని, ఆ కమిటీల్లోని సభ్యుల పేర్లను విధిగా ప్రతి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు కె.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ కార్యదర్శి నోముల రాముడు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం

వాటర్ ట్యాంక్‌ల శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రజలు తాగునీటి సమస్యలతో పడుతున్న ఇబ్బందులు తెలుసుకొని వెంటనే వాటర్ ట్యాంక్‌ల పనులు చేపట్టామని, తాగునీటి సమస్యలు పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో ఉన్నామని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని కోటనాగవరం పంచాయతీ పరిధిలో రూ.58 లక్షలతో నిర్మిస్తున్న రెండు వాటర్ ట్యాంక్‌లకు శంకుస్థాపన చేసి, పనులను పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మొడియం రామతులసి, వైస్ ఎంపిపిలు గుగ్గులోతు మోహన్‌రావు, కుక్కల వరలక్ష్మి, స్థానిక సర్పంచి తెల్లం వెంకటలక్ష్మి ఉపసర్పంచి శ్రీను, స్థానిక వైసిపి నాయకులు తాళ్లూరి ప్రసాద్, కుక్కల లచ్చిపండు, జిసిసి స్టేట్ డైరెక్టర్ తెల్లం చిన్నారావు, ఎస్‌సి సెల్ జిల్లా సెక్రెటరి నక్కా శివాజీ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ

వైఎస్ఆర్ పశు బీమాను వినియోగించుకోవాలి

టి.నరసాపురం : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని పశువులు, గొర్రెలు, మేకలు, పందులు కలిగిన రైతులు వినియోగించుకోవాలని బొర్రంపాలెం వెటర్నరీ డాక్టర్ డి.ప్రశాంతి శనివారం విలేఖరులకు తెలిపారు. వైఎస్ఆర్ పశు బీమా పథకం ద్వారా ప్రభుత్వం రాయితీతో బీమా కంపెనీ వారికి ప్రీమియం చెల్లించి, పాడిపశువులకు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ పథకంలో గరిష్టంగా ఐదు పెద్ద పశువులకు లేదా 50 మేకలు, గొర్రెలు, పందులమందకు నమోదు చేయించుకోవచ్చన్నారు. పాడి ఆవులు, ఎద్దులకు రెండు నుంచి పది సంవత్సరాల వయస్సు, పాడి గేదెలకు 3 నుంచి 12 సంవత్సరాల వయసు, గొర్రెలు, మేకలు, పందులకు 6 నెలల కన్నా ఎక్కువ వయసు ఉన్నవి ఈ పథకంలో నమోదు చేసుకోవాలన్నారు. ఆవులు, ఎద్దులు గేదెలకు ఖచ్చితంగా మూడు సంవత్సరాలు, గొర్రెలు, మేకలు, పందులకు 1 లేదా 3 సంవత్సరాల కాల పరిమితికి బీమా చేయించాలని తెలిపారు. ఆవులు, గేదెలు, ఎద్దులకు రూ.30 వేలు, నాసిరకం ఆవులు లేదా గేదెలకు రూ.15 వేలు బీమా, గొర్రెలు, మేకలు, పందులకైతే ఒక్కో దానికి రూ.6 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఆవు, ఎద్దు, గేదెలకు 3 సంవత్సరాలకు బీమా ప్రీమియం రూ.1,920 (పశువు విలువలో 6.4శాతం) ఎస్‌సి, ఎస్‌టిలకు 20 శాతం అనగా రూ.384 దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్న పాడి రైతులు 50 శాతం రూ.960 చెల్లించాల్సి ఉంటుందని మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. గొర్రె, మేక, పందులకు బీమా ప్రీమియం రూ.375 (పశువు విలువలో 6.25శాతం)లో ఎస్‌సి, ఎస్‌టి రైతులు రూ.75 చెల్లించాలని, మిగిలిన రైతులు రూ.188 చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలోని పశుసంవర్థక సహాయకుల ద్వారా రైతు వివరాలు, పశువు పూర్తి వివరాలు నమోదు చేయించుకుని రైతు వాటా బీమా సొమ్మును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. ప్రమాదవశాత్తు లేదా వ్యాధుల వల్ల పశువు చనిపోయినట్లయితే ఈ బీమా పథకం వర్తిస్తుందన్నారు. పశువు మరణించిన విషయాన్ని 24 గంటల లోపు పశు సంవర్థక సహాయకులకు తెలియజేయాలని సూచించారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా: రామకోటయ్య

ప్రజాశక్తి - చాట్రాయి

నూజివీడు నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎంఎల్‌ఎగా గెలుస్తానని చిన్నం రామకోటయ్య అన్నారు. చాట్రాయి మండలంలోని బూరుగు గూడెం గ్రామంలో శనివారం నూతన గృహ ప్రవేశం చేసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో తనకు ఎనలేని మద్దతు ప్రజలు చూపిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మండలంలో 43 వేల ఓటింగ్‌లో 25 వేల ఓట్లు నాకే పడతాయని గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎంపిటిసిలు, సర్పంచ్లు, నియోజకవర్గంలోని తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మద్దతుదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐదువేల మందికి పైగా భోజన అతిథ్యాన్ని స్వీకరించారు.

లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రష్యాలో జార్జి చక్రవర్తి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని, ప్రజలను చైతన్యపరిచి విప్లవాన్ని సాధించిన మార్క్సిస్ట్ మహోపాధ్యాయులు లెనిన్ విప్లవ స్ఫూర్తితో భారత దేశ విప్లవకారులు ముందుకు సాగాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా శనివారం ఏలూరులో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో యువిత ప్రసంగాన్ని కొనసాగిస్తూ రష్యాలో జారు చక్రవర్తుల పరిపాలనలో ప్రజలు తీవ్ర కష్టాలు, నష్టాలు అనుభవించారని, తినటానికి తిండి లేని పరిస్థితిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. ప్రజల బాధలు పోవాలంటే విప్లవంలో ముందుకు సాగాలని లెనిన్ ప్రజలను చైతన్యపరిచాడన్నారు. కారల్ మార్క్స్, ఎంగిల్స్ రూపొందించిన కమ్యూనిస్టు సిద్ధాంతం వెలుగులో రష్యాలో విప్లవాన్ని సాధించడానికి లెనిన్ చేసిన కృషి అమోఘమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ సభలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని, సిఎల్‌సి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.రత్నం ప్రసంగించారు.

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు : అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం 2024 నూతన సంవత్సరం క్యాలెండర్ ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా సేవలు అభినందనీయం అని అన్నారు. మహిళల సమస్యలపై చేస్తున్న కార్యక్రమాలకు మా వంతు సహకారం అందిస్తామన్నారు. ఐద్వా కార్యక్రమాలు ఇంకా పెద్దఎత్తున కొనసాగించాలని ఆమె తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మంచినీరుకన్నా మద్యం, బార్లు విచ్చలవిడిగా లభిస్తున్నాయన్నారు. దీనివల్ల యువత చెడమార్గంలో పడుతున్నారు, చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. జిల్లాలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని వాటి పరిష్కారంకోసం ఐద్వా పనిచేస్తుందని వాళ్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, విజయ, ఉదయకుమారి, కళ్యాణి, ఆంతోని పాల్గొన్నారు.

పట్టిసీమ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మహాశివరాత్రి ఉత్సవాల అధికారుల సమావేశంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ

పోలవరం : భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టిసీమ గ్రామ సచివాలయం వద్ద మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు మహాశివరాత్రి సందర్భంగా భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలతో మహాశివరాత్రి పట్టిసీమ ఉత్సవకమిటీ ఛైర్మన్, ఆర్‌డిఒ అద్దయ్య అధ్యక్షతన మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తుల మనోభావాలకు తగిన రీతిలో ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఆలయం వద్ద ప్రధాన రహదారుల్లో రాకపోకలకు అంతరాయం కలుగకుండా, తొక్కిసలాట జరుగకుండా ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్ల ఏర్పాటు చేపట్టాలన్నారు. ఉత్సావాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు ప్రాధాన్యతతో నిర్వహించాలని, భక్తుల రద్దీకి తగ్గట్టుగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ ప్రజలు విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఆర్‌డిఒ అద్దయ్య మాట్లాడుతూ మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే ఈ మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు వారి శాఖల వివరాలను రెండవ సమావేశంలో తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, సర్పంచి జయరామ్ మూర్తి, తహశీల్దారు బి.సుమతి, ఇఒ సంగమేశ్వరశర్మ పాల్గొన్నారు.

అవరోధాలే నూతన ఆవిష్కరణలకు మార్గాలు

డాక్టర్ చిరంజీవి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

అవరోధాలు నూతన ఆవిష్కరణలకు మార్గం వేస్తాయని, ఆవిష్కరణ అనేది మన జీవన విధానంలో ఒక భాగం అని, చిన్న పిల్లలు ఆడే బొమ్మలను భిన్నమైన రూపాలలోకి మార్చేస్తూ ఆవిష్కరణలు చేస్తుంటారని డాక్టర్ ఊసా చిరంజీవి శ్రీనివాసరావు తెలిపారు. నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'భౌతిక, రసాయన శాస్త్ర విభాగం ఎలక్ట్రో కెమికల్ డివైసెస్ ఫర్ బయో మెడికల్ అప్లికేషన్స్' అనే అంశంపై అతిథి ఉపన్యాసం కళాశాల సెమినార్ హాల్లో శనివారం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వర రావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల ఫలితంగా నేటి సమాజంలో మానవుడు సుఖవంతంగా, సౌకర్యవంతంగా, ఆనందంగా జీవించగలుగుతున్నారని చెప్పారు. ముఖ్య వక్తగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఐఐటి కాన్పూర్‌లో సీనియర్ ప్రాజెక్టు సైంటిస్ట్‌గా సేవలందిస్తున్న చిరంజీవి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన అవసరానికి కొత్త మార్గాలను అనుసరిస్తూ ఉంటాడన్నారు. అది సమాజ అభివృద్ధికి, ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడే ఆవిష్కరణగా మారాలని తెలియజేశారు. ఎలక్ట్రో కెమికల్ డివైసెస్ బయో మెడికల్ ఆవిష్కరణలోని వివిధ రకాల వస్తువులు, వాటి పనితీరులను విద్యార్థులకు వివరించారు. తాను ఆవిష్కరించిన చెమటతో షుగర్ పరీక్షలు చేసే పరిశోధనకు కారణం నాలుగేళ్ల పాప షుగర్ వ్యాధితో బాధపడుతూ పరీక్షల నిమిత్తం ఇంజక్షన్ సూదితో రక్తం తీసిననప్పుడు పాప ఏడుపు తన మనసును కలచివేసిందని, బిడ్డ బాధను చూసిన తండ్రి మనసు విలవిల్లాడిపోయింది, అది చూసి నేను పరిష్కార మార్గాలు లేవా అని ఆలోచించగా తనకు తట్టిన ఆలోచనను నా పరిశోధనాంశంగా ఎంచుకుని చెమటతో షుగర్ పరీక్షలు చేసే ఆవిష్కరణలో విజయం సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండా రవి, రెడ్డయ్య, డాక్టర్ పి.బాబురావు, బివి.రెడ్డి, జూనియర్ కళాశాల లైబ్రేరియన్ రాజు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ చిరంజీవి శ్రీనివాస్‌రావును కళాశాల తరపున సన్మానించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

24 నుంచి ఉంగుటూరులో 'ఆడుదాం ఆంధ్రా'

భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు ఈనెల 24వ తేదీన ఉంగుటూరు కేంద్రంగా ప్రారంభం కానున్నాయని భీమడోలు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి తెలిపారు. భీమడోలు హైస్కూల్ వేదికగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడా పోటీలు సజావుగా జరిగేందుకు సహకరించిన భీమడోలు ఎంపిడిఒను గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు వైసిపి ప్రముఖులు తుమ్మగుంట రంగా సన్మానించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఐదు క్రీడా విభాగాల పోటీలకు భీమడోలు మండలం నుంచి ఐదుగురు పురుషులు, ఐదు మహిళల జట్లు ఎంపికయ్యాయన్నారు. దీనిలో భాగంగా క్రికెట్ పోటీలకు భీమడోలు రెండు(పురుషులు), భీమడోలు మూడు(మహిళలు), వాలీబాల్ పోటీలకు అంబర్‌పేట, పోలసానిపల్లి పురుష, మహిళల జట్లు, బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు భీమడోలు రెండు(పురుషులు), పూళ్ళ రెండు(మహిళలు), కబడ్డీ పోటీలకు పూళ్ల ఒకటి(పురుషులు), భీమడోలు ఒకటి(మహిళలు), ఖోఖో పోటీలకు భీమడోలు ఒకటి(పురుషులు), భీమడోలు రెండు(మహిళలు) జట్లు ఎంపికయ్యాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు క్రీడా మైదానాలు ఎంపిక కావాల్సి ఉందన్నారు. క్రీడలు సజావుగా సాగటానికి మండలస్థాయి క్రీడా పోటీలకు క్రీడా కన్వీనర్‌గా వ్యవహరించిన గుండుగొలను పీడీ వి.వెంకటేశ్వరరావుతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎన్.వెంకటరావు, సూర్య, ఎం.వెంకట్రావు, ముత్తయ్య, ఠాగూర్ సహకరించారని తెలిపారు. ఇదేవిధంగా ప్రజా ప్రతినిధులు సైతం తమ వంతు సహకారాన్ని అందజేశారన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 290-292/General/2023-24, Dated. 18-01-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of Vaporized Liquid Chlorine Gas Cylinders, Ferric Alum and Manufacturing Supply and Delivery of Push Carts in Municipal Corporation, Eluru"** Total No. of works is **3** with an amount of Rs. **29.79** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 20-01-2024. Last date of receipt of tenders is 25-01-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU